సాక్షి కర్నూలు
బుధవారం । 13 । ఆగస్టు । 2025




## అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం హైదరాబాద్‌కు చెందిన నృత్య గణపతి కూచిపూడి నాట్య అకాడమి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



## హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాసం మూడవ సోమవారానికి హుండీ ఆదాయం రూ.1,33,56,261, వెండి 32.700 కేజీలు, బంగారం 3.400 గ్రాములు వచ్చింది.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,626.06 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 80.003 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 21,910 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 21,705 |

## న్యూస్‌రీల్

### రానున్న మూడు రోజులూ వర్షాలే..

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు కోసిగి, తుగ్గలి మండలాల్లో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. అయితే వర్షాలు తేలికపాటి నుంచి ఒక మోస్తరుకే పరిమితం అయ్యాయి. వెల్దుర్తిలో 32.8, హాలహర్విలో 24.8, మద్దికెరలో 23.8, చిప్పగిరిలో 22.6, క్రిష్ణగిరిలో 18.8, ఆలూరులో 18.6, ఆస్పరిలో 15, గోనెగండ్లలో 14.2, ఓర్వకల్‌లో 11.2, హొళగుందలో 9.2, కల్లూరులో 7.8 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 9.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 124.4 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### ట్రిపుల్ ఐటీడీఎం రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ


రాజ్‌కుమార్ మాంఠీువాల్

కర్నూలు సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యాను ఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌డీఎం) రిజిస్ట్రార్‌గా రాజ్ కుమార్ మాంఠీువాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖతో సమన్వయం చేసుకొని ట్రిపుల్‌ఐటీడీఎం క్యాంపస్ రెండో దశ పనులను ప్రారంభిస్తామన్నారు. క్యాంపస్ కాంపౌండ్ వాల్‌ను పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. దేశంలోని అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలతో ట్రిపుల్‌ఐడీ పోటీ పడేలా తీర్చిదిద్దుతామన్నారు. ఇటీవల బదిలీ అయిన గురుమూర్తి స్థానంలో జైపూర్‌లోని మాలవ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న రాజస్థాన్‌కి చెందిన రాజ్‌కుమార్ మాంఠీువాల్‌ను నియమించారు. ఈయన ఐఐటీ జమ్మూకశ్మీర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో పని చేశారు. నూతన రిజిస్ట్రార్‌కు క్యాంపస్ అధ్యాపకులు స్వాగతం పలికారు.

### 22న మాజీ సైనికుల సమస్యలకు పరిష్కారం

కర్నూలు(అర్బన్): మాజీ సైనికులు, ఆయా కుటుంబాల వితంతువుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఈ నెల 22న మద్రాసు రెజిమెంట్‌కు చెందిన అధికారులు ఇక్కడకు వస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్.ఆర్.రత్నరూత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆ రోజున ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. మద్రాస్ రెజిమెంట్‌కు సంబధించిన వారు తమ సమస్యల పరిష్కారానికి పెన్షన్ పేమెంట్ ఆర్డర్, డిశ్చార్జి బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్ పాస్ బుక్‌తో పాటు అవసరమైన ధృవ పత్రాలతో స్వయంగా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సైనిక సంక్షేమ కార్యాలయ పనివేళల్లో 08518- 229445 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.





# బ్యాంకులు రుణాలివ్వవు..
# ప్రభుత్వ పథకాలు వర్తించవు!

### సీసీఆర్‌సీ కార్డుతో ఒరిగిందేమీ లేదు



కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నా. 2025-26 సంవత్సరానికి ఒక ఎకరా భూమిని కౌలుకు తీసుకున్నా. ఇందులో ఉల్లి సాగు చేస్తున్నాం. కౌలుతో పాటు ఉల్లి సాగులో పెట్టుబడి వ్యయం కూడా ఎక్కువే. కౌలుకు తీసుకున్న భూమికి కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డు మంజూరు చేసింది. అయితే నాకు అన్నదాత సుఖీభవ వర్తించలేదు. బ్యాంకులు పంట రుణం కూడా ఇవ్వడం లేదు. ఇంక ఈ కార్డు తీసుకొని ఏమి ఉపయోగం.

– ముక్తార్‌బాషా, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

### ఎందుకూ పనికిరాని సీసీఆర్‌సీ కార్డులు

- కౌలు రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటి వరకు 34,258 సీసీఆర్‌సీ కార్డుల జారీ
- ఒక్కరికీ అందని అన్నదాత సుఖీభవ సాయం
- లోన్లు ఇవ్వలేమని చెబుతున్న బ్యాంకర్లు
- కష్టాల సాగు చేస్తున్న కౌలు రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కౌలుదారుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 4వ తేదీ వరకు 34,258 మంది కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసినా ఒక్కరికీ మేలు జరిగిన దాఖలాలు లేవు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారుల్లో ఒక్కరికి కూడా అన్నదాత సుఖీభవ సాయం అందకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం సాగుదారులకు అండగా నిలిస్తే.. కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి కౌలుదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని సీసీఆర్‌సీ(ప్రస్తుతానికి) కార్డులు జారీ చేస్తున్నా ఫలితం లేకపోతోంది. కౌలుదారులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ అధికారులు ఈ కార్డుల వివరాలను సంబంధిత బ్యాంకులకు ఎప్పటికప్పుడు పంపుతున్నా వీటిని బ్యాంకర్లు పరిగణనలోకి తీసుకోని పరిస్థితి.

### కౌలు రైతులు ఎలా బతికేది



ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. కౌలు కింద కరెంట్ మోటార్ ఉంటే ఎకరాకు 22 బస్తాలు, లేకపోతే 18 బస్తాలు ధాన్యం ఇవ్వాల్సి ఉంది. 2024-25లో ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డు మంజూరు చేసింది. ఈ కార్డు 2025-26 సంవత్సరానికి రెన్యూవల్ అయ్యింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ కింద ఒక్క రూపాయి కూడా అందలేదు. బ్యాంకులకు పోతే రుణాలు ఇవ్వం అంటున్నారు. సంక్షేమ పథకాలు వర్తించకపోతే ఎలా బతికేది.

– గద్దం నరసింహుడు, పార్నపల్లి, బండిఆత్మకూరు మండలం

### సీసీఆర్‌సీ కార్డుల జారీలో సైతం ముడుపులే..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. చివరికి కౌలుదారులకు జారీ చేసే సీసీఆర్‌సీ కార్డుల జారీకి కూడా కొందరు వీఆర్వోలు ముడుపులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీసీఆర్‌సీ కార్డు జారీ కావాలంటే రూ.10 స్టాంపుపై రాసుకున్న అగ్రిమెంట్ భూయజమాని, కౌలుదారు ఇద్దరూ సంతకాలు చేయాల్సి ఉంది. అయితే వీఆర్‌ఓలు మేము క్షేత్రస్థాయికి వచ్చి విచారణ జరుపుతామని నాన్చివేత ధోరణికి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో అవన్నీ ఎందుకు అన్నట్లుగా రూ.1,000 వరకు డబ్బులిచ్చి కార్డులు పొందుతున్నట్లు సమాచారం.

### తూతూ మంత్రంగా సీసీఆర్‌సీ కార్డులు

ఉమ్మడి జిల్లాలో 7 లక్షల మంది రైతులు ఉన్నారు. అనావృష్టి, అతివృష్టి వల్ల ఏటా పంటలు దెబ్బతింటుండటం వల్ల కొన్నేళ్లుగా రైతులు భూములను కౌలుకు ఇస్తూ వలస వెళ్తున్నారు. అనధికారికంగా జిల్లాలో కౌలు రైతులు దాదాపు 2.50 లక్షల వరకు ఉన్నారు. భూమి యజమాని సమ్మతితోనే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తారు. ఈ ప్రకారం 2025-26లో కర్నూలు జిల్లాలో 25 వేలు, నంద్యాల జిల్లాలో 30 వేల ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు 11 నెలల కాలపరిమితితో కర్నూలు జిల్లాలో 21,799, నంద్యాల జిల్లాలో 12,459 కార్డులు మాత్రమే జారీ అయ్యాయి.


సాగుదారులకు జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డు

### కౌలుదారులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 11 నెలల కాల పరిమితితో సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసింది. ఈ రైతులకు పెట్టుబడి సాయంగా వైఎస్ఆర్ రైతుభరోసా కింద రూ.13,500 పూర్తిగా అందించింది. కౌలుదారులతో పాటు ఆర్‌ఓఎఫ్ఆర్ రైతులు, దేవదాయ భూములు అనుభవిస్తున్న వారికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి రైతు భరోసాను వర్తింపజేసింది. 2023-24లో భారీ ఎత్తున సీసీఆర్‌సీ కార్డులు జారీ కావడంతో వైఎస్ఆర్ రైతుభరోసా కింద ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం లభించింది. ఒక్క ఏడాదే కాదు ఐదేళ్లు కౌలుదారులకు పెట్టుబడిసాయం అందింది. మొత్తం 28,600 మంది సాగుదారులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసాతో లబ్ధి పొందడం విశేషం.

### బ్యాంకర్లు చెబుతన్న కారణాలు ఇవీ..

- కౌలుదారులకు రుణాలు ఇవ్వలేమని వివిధ బ్యాంకులు స్పష్టంగా ప్రకటించాయి.
- ఇప్పటికే కౌలుదారులు సాగు చేసుకుంటున్న భూములపై యజమానులు రుణాలు తీసుకున్నారు.
- ఒకే భూమిపై ఇటు యజమానికి, అటు కౌలుదారులకు రుణాలు ఇవ్వలేం.
- ఒకవేళ భూముల యజమానులు రుణాలు తిరిగి చెల్లిస్తే.. ఆ స్థానంలో కౌలుదారులకు రుణాలు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తాం.

### తడిసి మోపెడవుతున్న కౌలు

మెట్ట భూమి అయితే ఒక ఎకరా కౌలు కనీసం రూ.5వేల నుంచి 10 వేల వరకు ఉంటోంది. నీటి పారుదల సదుపాయం ఉంటే ఎకరాకు రూ.30 వేల వరకు కౌలు తీసుకుంటున్నారు. సెంటు భూమి కూడా లేని వారు భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయంలో రాణిస్తున్నారు. కౌలు, పెట్టుబడి మొత్తం కలిపి ఎకరాకు పంటను బట్టి రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు వస్తోంది. సీసీఆర్‌సీ కార్డులు పొందినప్పటికీ బ్యాంకులు సహకరించకపోవడంతో పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు భార్యల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది.

# జెండా.. గుండెల నిండా!


భారీ జాతీయ పతకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

- 1.1 కిలోమీటర్ల పొడవు జాతీయ జెండా ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): ఆజాదీకి అమృత్ మహోత్సవంలో భాగంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులో 1.1 కిలోమీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు, యువతీ, యువకులు ప్రదర్శించారు. సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాల నుంచి కొండారెడ్డి బురుజు వరకు దాదాపు 2,800 మంది విద్యార్థులు మువ్వన్నెల తిరంగా ప్రదర్శించగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వీక్షించారు. గ్లోబల్ టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ ఖాజా మాలిక్, సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థులు, ఐ అముజయ యునైటెడ్ యంగ్ స్టార్ అసోసియేషన్ యూత్ బిగ్రేడు-2025 సహకారంతో 1.1 కిలోమీటర్ల పొడవు జాతీ య జెండాను రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఇలాంటి మువ్వన్నెల జెండాల ప్రదర్శన ద్వారా ప్రజల్లో జాతీయ సమైక్యత భావాలు కలుగుతాయని, ఆగస్టు 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. కాగా, ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు వచ్చి రికార్డు చేశారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్‌పాల్, గ్లోబల్ టౌన్‌షిప్ ఎండీ పవన్ సోలంకి, సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన డీన్ శౌరీలు రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత పాల్గొన్నారు.

# టోకెన్లు ఇచ్చారు.. యూరియా లేదంటారు!


రైతు సేవా కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు


టోకెన్లు చూపుతున్న రైతన్నలు

కౌతాళం: అధికారుల ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేదని చెప్పేందుకు ఈ ఘటనే నిదర్శనం. ఓ వైపు ఎరువుల కొరత లేదని అధికారులు చెబుతుంటే.. నెల రోజులుగా నిరీక్షిస్తున్నామని రైతులు రోడ్డెక్కారు. రెండు నెలల నుంచి రైతులకు రైతు సేవా కేంద్రాల చుట్టూ తిప్పకుంటున్నారే తప్ప యూరియా ఇవ్వడం లేదు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం కౌతాళంలో రైతులు రోడ్డెక్కా రు. గత నెల 15వ తేదీన కొందరికి, 17వ తేదీన మరి కొంత మంది రైతులకు యూరియా కోసం డబ్బులు తీసుకుని టోకెన్లు ఇచ్చారు. ఇప్పటికే 28 రోజులు గడిచినా యూరియా లేక పోవడంతో ఆందోళన చెందారు. మంగళవారం రైతు సేవా కేంద్రానికి యూరియా లోడ్ వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు తరలివచ్చారు. అయితే డబ్బులు తీసుకుని టోకెన్లు రాసి ఇచ్చిన వారికే యూరియా తక్కువ వస్తుందని, మిగతా వారికే ఎలా ఇవ్వాలని ఎంపీఈఓ కార్తీక్ రైతులను సముదాయించారు. అందరికీ యూరియా ఇవ్వాలని, వ్యవసాయాధికారి శేషాద్రిని పిలిపించాలని రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఏఓ అక్కడికి చేరుకుని నెల క్రితమే టోకెన్లు తీసుకున్న వారికి మూడు బస్తాల చొప్పున యూరియా ఇచ్చి మిగిలాది వేరే రైతులకు ఇస్తామని చెప్పారు. అయితే నెల రోజుల క్రితం డబ్బులు కట్టి నిరీక్షిస్తున్న తమ యూరియా ఇవ్వక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రైతులను కూటమి ప్రభుత్వం ఇక్కట్లకు గురి చేస్తుందని విమర్శించారు.

### మంత్రి టీజీ భరత్ అనుచరుల రౌడీయిజం

- పెద్దాసుపత్రిలోని సెక్యూరిటీ కార్యాలయంపై దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం రాత్రి మంత్రి టీజీ భరత్ అనుచరులు రౌడీయిజం చేశారు. ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను ఈగల్ హంటర్ సొల్యూషన్స్ సంస్థ జూన్ నెల నుంచి నిర్వహిస్తోంది. కొంత కాలంగా కోడుమూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడైన విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు, మంత్రి టీజీ భరత్ అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు స్థానికులైన తమకే సబ్ లీజుకు ఇవ్వాలని ఈగల్ హంటర్ ఏజెన్సీపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో భాగంగా విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు సబ్‌లీజుకు తీసుకుని రెండు వారాలుగా ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేస్తున్నారు. ఇదే సమయంలో మంత్రి టీజీ భరత్ అనుచరులు తమ వారినే సెక్యూరిటీ గార్డులుగా నియమించాలని డిమాండ్ చేసినా పెడచెవిన పెట్టి నచ్చిన వారిని ఇప్పటికే 25 మందికి పైగా నియమించుకున్నట్లు సమాచారం. విషయం తెలిసిన మంత్రి టీజీ భరత్ అనుచరులు ముగ్గురు మంగళవారం రాత్రి ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఏజెన్సీ కార్యాలయం వద్దకు వచ్చి అక్కడ విధులు నిర్వహిస్తున్న వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ఎత్తివేసి బీభత్సం సృష్టించారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు రాత్రి 10 గంటల తర్వాత ఆసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

అశేష భక్తజన వాహిని మధ్య రాయరు రథోత్సవ దృశ్యం



# భువనమోహనుడికి బ్రహ్మారథం

- అశేష జనవాహిని మధ్య సాగిన రాఘవేంద్రుల రథయాత్ర
- అలరించిన కళాకారుల నీరాజనాలు

మంత్రాలయం: భువనమోహనుడు మహారథంపై ఊరేగిన వేళ.. తుంగభద్రమ్మ మది పులకించిపోయింది. వేదభూమి పరవశించి ఆధ్యాత్మిక పరిమళాలతో శోభిల్లింది. భక్తజనం హర్షధ్వానాలతో జపించింది. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవం కనులపండువగా సాగింది. ఉత్తరారాధనలో భాగంగా ముందుగా ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు వేద పాఠశాలకు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ పాఠశాల విద్యార్థులు ఉత్సవమూర్తికి వేద పఠనం గావించి దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం మూల బృందావనం చేరుకోగా స్వామి వారికి విశేష పూజలు గావించి వసంతోత్సవానికి శ్రీకారం పలికారు. గర్భాలయంలో అర్చకులు, పండితులు, పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గులాలు చల్లుకుని ఆచార వైభవాన్ని స్ఫురింపజేశారు. అనంతరం ఉత్సవమూర్తిని మహారథంపై కొలువుంచగా.. భక్తజనులు గోవిందా.. గోవిందా.. అంటూ ప్రణమిల్లుతూ దర్శించుకున్నారు. పీఠాధిపతి ప్రవచనం ముగియగానే భక్తులను ఆశీర్వచనం చేస్తూ 12.15 గంటలకు రథయాత్రకు అంకురార్పణ పలికారు. మధ్వ కారిడార్ చేరుకోగానే స్వామిజీ హెలికాప్టర్‌తో పుష్పవృష్టి కురిపించారు. మంగళ వాయిద్యాలు, డోలు దరువులు, రంగుల ఆటలు, యువతుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, కోలాటాల మధ్య మహారథం ముందుకు కదిలింది. రాఘవేంద్ర సర్కిల్ వద్ద స్వామిజీ పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు ఉత్సవమూర్తికి పూజలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రథోత్సవంలో పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.


ఊరేగింపుగా ఉత్సవమూర్తిని తీసుకొస్తున్న దృశ్యం

### రూ.250 కోట్లతో జలాశయం

మంత్రాలయం క్షేత్రం సౌకర్యార్థం రూ.250 కోట్లతో జలాశయాన్ని నిర్మిస్తున్నట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. వేడుకలో స్వామిజీ ప్రసంగిస్తూ క్షేత్రంలో అంతర్గత రహదారులతో పాటు రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాఘవేంద్ర సర్కిల్ వరకు కారిడార్ నిర్మిస్తామ న్నారు. శ్రీమఠం దినదినాభివృద్ధికి అంతరంగిక భక్తుల సహకారం ఎంతో ఉందన్నారు. వేడుకల్లో పండిత కేసరి రాజా ఎస్. గిరియాచార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతి ఆచార్ తదితరులు పాల్గొన్నారు.


వసంతోత్సవంలో పీఠాధిపతి, పండితులు


స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్


కళాకారుల ప్రదర్శన